## క్లుప్తంగా...

### నేడు శాంతినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్ చౌరస్తాలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు సామాజిక కార్యకర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పి. మధుబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికోవర్ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ఐ చెకప్, డెంటల్ చెకప్, బీపీ, షుగర్ పరీక్షలు, వెయిట్, పల్స్, ఆర్‌బీఎస్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు మంత్రి తలసాని పర్యటన

సనత్‌నగర్: రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం సనత్‌నగర్‌లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు ఉదయ్‌నగర్‌లో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకోనున్నారు. హిందూ పబ్లిక్ స్కూల్ పరిసరాల్లో పర్యటించనున్నారు.

### రేషన్‌కార్డు దారులు కేవైసీ నమోదు చేసుకోవాలి


సర్కిల్ 9 ఏఎస్‌ఓ శ్రీనాథ్

రాంగోపాల్‌పేట్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డుదారులందరూ రేషన్ డీలర్ వద్ద ఎలక్ట్రానిక్ కేవైసీలో పేర్లు నమోదు చేసుకోవాలని సివిల్ సప్లై సర్కిల్ 9 ఏఎస్‌ఓ శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రేషన్‌కార్డు దారుల కుటుంబ సభ్యుల్లో కొందరు చనిపోయారని, మరికొందరు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నా ఏళ్ల తరబడి వారి పేరుతో రేషన్ దుకాణాల్లో బియ్యం తదితర నిత్యావసర సరుకులు పొందుతున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డుదారులు స్థానిక రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ఈ పాస్ మిషన్‌లో తమ కేవైసీని రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ అంశంపై డీలర్లు రేషన్‌కార్డుదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

### సినీ హీరో సుమన్‌ను కలిసిన నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు



లాలాపేట: తెలుగు సినీ నటుడు సుమన్‌ను శుక్రవారం నాయీ బ్రాహ్మణ సంఘం జేఏసీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. జి ఎల్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'దుమారం' సినిమాలో సుమన్ నాయీ బ్రాహ్మణుడి పాత్రలో నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తమ ఇబ్బందులు తెలియజేసేందుకు సుమన్ పోషిస్తున్న పాత్ర ఎంతగానో దోహద పడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమన్, దర్శకుడు జి ఎల్ శ్రీనివాస్, వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ధన్‌రాజ్, వీఎస్సార్ వెంకటేష్ , చక్రవర్తి, సిద్దయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి


డిప్యూటీ మేయర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాణికేశ్వర్‌నగర్ వాసులు

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లోని 2వ వీధిలో గల్లీ రోడ్డును అక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాణికేశ్వర్‌నగర్ వాసులు శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అసలే గల్లీ రోడ్డు అందులో నిర్మాణం చేపడితే రాకపోకలకు ఇబ్బందురవుతాయన్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ మేయర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. నర్సింహ, ఉప్పు వెంకటయ్య, వరికుప్పల శ్రీహరి, వేముల మల్లేష్, వరికుప్పల మహేశ్, కృష్ణ, ఓర్సు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

సనత్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై ఎస్సార్‌నగర్ పోలీసులు దాడి చేశారు. ఇద్దరు నిర్వాహకులతో పాటు మరో ఆరుగురిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ పీవీ రామప్రసాదరావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బల్కంపేటలోని నేచురల్ బ్యూటీ సెలూన్ అండ్ స్పాలో అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సార్‌నగర్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. విజయ్‌కుమార్ అనే వ్యక్తి ఇంటిని అద్దెకు తీసుకుని, వ్యభిచార కేంద్రం నిర్వహించేందుకు రేణుక అనే మహిళకు రోజుకు రూ.2,500 చొప్పున అద్దెకు ఇచ్చినట్లు గుర్తించారు. పోలీసులు విజయ్‌కుమార్‌తో పాటు రేణుక, మరో ముగ్గురు యువతులు, ముగ్గురు విటులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


లాలాపేటలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

# ఎన్నికల కోసమే సంక్షేమ పథకాలు

లాలాపేట: ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ కార్యక్రమాల పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీకరెడ్డి అన్నారు. శుక్రవారం తార్నాక డివిజన్ లాలాపేటలో బీజేపీ ఆధ్వర్యంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ధోకా ఇచ్చిన కేసిఆర్‌ను నిలదీద్దాం అంటూ చేపట్టిన మహాధర్నా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏపీలో ముఖ్యమంత్రి జగన్ దాదాపు 20 లక్షల పక్కా ఇళ్లు నిర్మించి ప్రజలకు అందజేస్తుంటే తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష డబుల్ బెడ్‌రూంల పేరుతో పేద ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పేరుతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. ఇంటి జాగా ఉన్న వారికి రూ. 5 లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ. 3 లక్షలకు ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. ఒక వైపు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇంటి నిర్మాణ వ్యయాన్ని పెంచాల్సిందిపోగా తగ్గించడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.అనంతరం లాలాపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, సారంగపాణి, పోచయ్య యాదవ్, వెంకటేష్‌గౌడ్, వీరన్న,సుక్క గణేష్, శివరెడ్డి, అనిత, శారద, గండికోట నర్సింహ, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి**

రాంగోపాల్‌పేట్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డబుల్ బెడ్‌రూమ్‌లు, బీసీ బంధు, దళిత బంధు తదితర పథకాలు కేవలం కొద్ది మందికి మాత్రమే అందిస్తూ ప్రజలందరినీ మోసం చేస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాల పేరుతో ప్రజలను మభ్య పెట్టి ఆ తర్వాత అటకెక్కించడం తెలిసిందేనన్నారు. హుజురాబాద్ ఎన్నికల సమయంలో ప్రకటించిన దళిత బంధు పథకాన్ని కొంత మందికి మాత్రమే ఇచ్చి ఇప్పుడు కేవలం దరకాస్తులు తీసుకుని కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ బంధు కోసం హడావిడిగా ధరకాస్తులు ఆహ్వానించారని, చాలా మంది కుల, ఆదాయ ధృవీకరణల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగానే గడువు ముగిసిపోయిందన్నారు. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే పథకాలను అందిస్తూ ప్రజలందరినీ మోసం చేస్తున్నారని ఆరోపించారు. డబుల్‌బెడ్ రూమ్‌ల పేరుతో ఐడీహెచ్ కాలనీలో కొన్ని నిర్మించి వాటినే తెలంగాణా మొత్తం చూపించి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. నగరంలో డబుల్‌బెడ్ రూమ్‌లకు స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం ఎకరం వంద కోట్లకు విక్రయిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ అవసరాలకూడా స్థలాలు లేకుండా విక్రయిస్తున్నారన్నారు. అనంతరం ఆర్డీవో రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చీర సుచిత్ర శ్రీకాంత్, కొంతం దీపిక, సరళ, మాజీ కార్పొరేటర్ వసంత యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్ నాయకులు శ్రీశైలం, రాజు, హరినాథ్ నాయి, దిలారి లక్ష్మి, మాదవి, ప్రతాప్, మహేష్, దయానంద్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన


సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల వద్ద అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాంగోపాల్‌పేట్: పాఠశాలల ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులు, ఆటో డ్రైవర్లు, స్కూల్ యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు ప్రారంభం, ముగిసిన సమయాల్లో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెయింట్ ఆన్స్, సెయింట్ ప్యాట్రిక్స్, సెయింట్ మేరీస్, గీతాంజలి తదితర పాఠశాలల వద్ద ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై సతీష్ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో ప్రత్యక్షంగా ట్రాఫిక్‌ను జామ్‌లను పరిశీలించిన అనంతరం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల ప్రాంతాల్లో యాజమాన్యాలు సైన్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని, సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకుని విద్యార్థులు రోడ్డు దాటడంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాఠశాలల ప్రారంభం, వదిలే సమయంలో విద్యార్థులకు వేర్వేరు సమయాలను పాటించేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు స్కూల్ వదిలే సమయంలో ఒక వైపు మాత్రమే ఆటోలను నిలుపుకోవాలని సూచించారు. రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనాలను అక్కడి నుంచి తొలగించారు, మరో సారి పార్కింగ్ చేస్తే చలాన్లు విధిస్తామని హెచ్చరించారు.

## భక్తుల మనోభావాలను గౌరవించాలి

బన్సీలాల్‌పేట్: భక్తుల మనోభావాలను గౌరవిస్తూ దేవాలయాల పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసే విధంగా పాలక మండలి సభ్యులు పని చేయాలని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ బోలక్‌పూర్‌లోని సుప్రసిద్ధ శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం నూతన పాలక మండలి చైర్మన్, సభ్యులు శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ భక్తులు, దాత మనోభావాలను గౌరవిస్తూ ముందుకు సాగాలన్నారు. ఎలాంటి అవినీతి, ఆరోపణలకు తావు లేకుండా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. దేవాలయాల గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ కమిటీ చైర్మెన్ జి. శ్రీరాములుతో పాటు పాలక మండలి సభ్యులు ఎం. వెంకట్‌బాబు, ఎన్. నాగలక్ష్మీ, ఏసూరి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ఎ. సంధ్య, జి. లక్ష్మీలతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఏసూరి మహేష్, ఎల్. వెంకటేషన్, లక్ష్మీపతి, సుధాకర్, ప్రేమ్ తదితరులు ఉన్నారు.


మంత్రి తలసానితో పాలక మండలి సభ్యులు

## నేటి నుంచి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర

- బేగంపేట డివిజన్‌లో ఐదు రోజుల పాటు కొనసాగింపు
- 24న శ్యాంలాల్‌బిల్డింగ్‌లో బహిరంగ సభ
- హాజరుకానున్న మంత్రి తలసాని


బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌లో శనివారం నుంచి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర చేపట్టనున్నట్లు కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి తెలిపారు. బేగంపేటలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాదయాత్ర షెడ్యూల్‌ను వివరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బేగంపేట డివిజన్‌లో ఐదు రోజుల పాటు కొనసాగే ఈ పాదయాత్ర శనివారం ఉదయం ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రజా సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. మొదటి రోజు ప్రకాష్‌నగర్, పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం, అర్కా మసీదు, నర్సింహస్వామి టెంపుల్ లేన్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ఎస్‌సీ, బీసీ కమ్యూనిటీ హాల్, ఎస్ఆర్‌టీ, అయ్యంగార్ బేకరీ లైన్, ప్రకాష్‌నగర్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో కొనసాగుతుందన్నారు. 21న మయూరిమార్గ్ లైన్ నుంచి ప్రారంభమై అల్లంతోటబావి ద్వారకాదాస్, చీకోటి గార్డెన్, 22న శ్యాంలాల్ బిల్డింగ్, తాతాచారి కాలనీ, పోచమ్మబస్తీ, ఎరుకల బస్తీ, 23న అంబేడ్కర్‌నగర్ నుంచి మొదలై భగత్‌సింగ్‌నగర్, గురుమూర్తిలేన్, 24న మాతాజీనగర్‌లో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. అదేరోజు సాయంత్రం శ్యాంలాల్‌బిల్డింగ్‌లోని తాతాచారికాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

## ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పసుపు కుంకుమ



రాంగోపాల్‌పేట్: శ్రావణ మాసం తొలి శుక్రవారం నేపథ్యంలో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు. ఏటా తొలి శుక్రవారం మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ కుటుంబం అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పిండం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున భక్తులు, వేద పండితులతో కలిసి అత్తెల్లి అరుణగౌడ్ అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు.

◆ మహంకాళి అమ్మవారికి దేవాలయం తరుపున సాకను సమర్పించారు. ఐదు వారాల పాటు తనకు సాక సమర్పించాలని భవిష్యవాణిలో అమ్మవారు చెప్పిన సంగతి తెలిసిందే. నాలుగో శుక్రవారం 108 సాకలను భక్తులు తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, చైర్మన్ పరమేశ్వర్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఎనిమిది మందికి జైలు

సనత్‌నగర్: బేగంపేట పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 27 మంది పట్టుబడగా ఎనిమిదికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మొదటి సారి పట్టుబడిన ఐదుగురు, రెండోసారి పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష పడినట్లు బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు. మరో 19 మందికి జరిమానా విధించినట్లు ఆయన వివరించారు.

### బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

పద్మారావునగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నదని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్ గౌడ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కరువయ్యాయని.... పేద మధ్య తరగతి వర్గాలకు ఉపాధి దొరకడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ అభివృద్ధి చేసే పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాన్ని అందజేశారు.

### కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సీఐటీయూ నాయకులు మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ధర్నా చేపట్టారు. వర్సిటీలో 30 సంవత్సరాలుగా తక్కువ వేతనానికి పని చేస్తున్న టైంస్కేల్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీతారాం, శ్రీధర్‌రావు, శ్యామల. నరేష్, నాగరాజు, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థి అమర వీరుల ఆశయ సాధన అభివృద్ధి అంశాల పై అఖిల పక్ష సమావేశం జరిగింది. కార్యక్రమానికి టీజేఎస్ రాష్ట్ర అధ్యాపకులు ప్రొ.కోదండరామ్ అధ్యక్షత వహించగా ప్రొ.గాలి వినోద్‌కుమార్, ప్రొ.చంద్రు నాయక్, డాక్టర్ రియాజ్, తెలంగాణ విఠల్, డాక్టర్ పృథ్వీరాజ్ తదితరులు విద్యార్థులు, నిరుద్యోగులు, యువత సమగ్ర, అభివృద్ధి మేనిఫెస్టో, రాజకీయాల్లో యువత ఆవశ్యకత తదితర అంశాలపై ప్రసంగించారు. విద్యార్థి జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్, అధ్యక్షులు వలిగొండ నరసింహ, జనరల్ సెక్రెటరీ బోడ వంశీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక సమస్యలను పరిష్కరించండి

సికింద్రాబాద్: కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని డీఆర్ఎం భరతేష్ కుమార్‌ను మజ్దూర్ నాయకులు కోరారు. సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన భరతేష్ కుమార్ జైన్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఆర్ఎంను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్ఎంను కోరారు. రవీందర్, స్వామి, స్వరూప, సలీం తదితరులు పాల్గొన్నారు.

### విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి

అడ్డగుట్ట: విద్యార్థులకు తరగతికి తగినట్లు సామర్థ్యాలను పెంపొందించేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ. భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌లో సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. మూడో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు 178 మంది విద్యార్థులకు సామాజిక తనిఖీ నిర్వహించగా, 137 మంది విద్యార్థులకు చదవడం, రాయటం, అక్షరాలను గుర్తించటం రావట్లేదన్నారు. విద్యా ప్రమాణాలు ఇలాగే కొనసాగితే విద్యార్థుల భవిష్యత్ అంధకారయయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సామర్థ్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

## వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించాలి


బాక్సింగ్ విజేత దేవానందంను సన్మానిస్తున్న నాగులూరి సాయిబాబా

చిలకలగూడ : క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న వర్ధమాన క్రీడాకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రముఖ సంఘసేవకుడు, కాంగ్రెస్ సీనియర్ లీడర్ నాగులూరి సాయిబాబా అన్నారు. చిలకలగూడ నాగులూరి వెల్ఫేర్ అసోషియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల దుబాయ్‌లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన నామాలగుండుకు చెందిన మామిడి దేవానందంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో ఎందరో వర్ధమాన క్రీడకారులు ఉన్నారని, వారిని అన్నివిధాల ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. తనవంతు ఆర్థికసాయం అందించారు. దుబాయ్‌లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో 79 కిలోల విభాగంలో థాయిలాండ్, శ్రీలంక, యుఏఈ, క్యూబా, దక్షిణాఫ్రిక దేశాలకు చెందిన బాక్సర్‌లతో తలపడి బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందని విజేత దేవానందం అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సతీష్, ఆంజనేయులు, ప్రమోద్, మిత్రులు మధు, సోను, అమ్రేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ పోరాట ఫలితంగానే 30 పడకల ఆస్పత్రి మంజూరు


మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి శ్రీనివాస్

అడ్డగుట్ట: సీపీఐ దశల వారీగా చేసిన పోరాటాల ఫలితంగానే అడ్డగుట్టలో ఆస్పత్రి మంజూరైందని ఆ పార్టీ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అడ్డగుట్టలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి అడ్డగుట్టలో 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఏ, బి సెక్షన్లలో పూర్తిగా గుంతల మయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు. తుకారాంగేట్ మదీనా చికెన్ సెంటర్ ప్రాంతంలో తాగునీటి లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ నాయకులు కొమరెల్లి బాబు, యాదగిరి, రషీద్, రంజిత్ సింగ్, శంకర్, ఖాజా, కాసిం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు కాదు.. బీఆర్ఎస్ బంధు


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: దళిత బంధు పథకం సనత్‌నగర్‌లో బీఆర్ఎస్ బంధుగా మారిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ఆరోపించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో శుక్రవారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన ఈ పథకం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కల్పతరువుగా మారిందన్నారు. ఎంతో మంది అర్హులైన నిరుపేద దళితులు ఉన్నా వారిని కాదని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పథకాన్ని వర్తింపజేస్తున్నారన్నారు. ప్రభుత్వ సొమ్మును పార్టీ శ్రేణులకు పంచిపెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి డాక్టర్ కోట నీలిమ కండువాలు కప్పిలో పార్టీలోకి ఆహ్వానించారు.రమేష్, చిరంజీవి, చంద్రశేఖర్, మహేష్, ఉదయ్ భాస్కర్, నవీన్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయాలి



మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

లాలాపేట: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న తపస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని 'తపస్' హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి అన్నారు. మహాధర్నా వాల్‌పోస్టర్‌ను శుక్రవారం లాలాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై నెల రోజులుగా ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ కమిటీ వేసి తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఈహెచ్ఎస్ కార్డులపై అన్ని ఆసుపత్రుల్లో పరిమితి లేకుండా చికిత్సను అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావేంజర్లను, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరావు, భిక్షపతి, అజయ్‌కుమార్, మాధవీ లత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని గడ్డమీదిబస్తీలో శుక్రవారం తాగునీటి పైప్‌లైన్ పనులకు జలమండలి అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు పెండింగ్ పనుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సరిత, సెక్షన్ మేనేజర్ నిఖితా రెడ్డి, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీను, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, మనోహర్, సత్తయ్య, వసంత, మహమ్మద్, దేవయ్య, మహేశ్వరి, ఇస్మాయిల్, రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్న జయంతి


సర్వాయి పాపన్న జయంతి వేడకల్లో పాల్గొన్న క్రిషాంక్ తదితరులు

రసూల్‌పురా: గడీలు, దొరలు, మొగలుల పాలనకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటంతో మొగలుల కోటను జయించిన పరిపాలన చేసిన సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ వెన్ను చూపని వీరుడని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే క్రిషాంక్ అన్నారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా న్యూ బోయిన్‌పల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న విగ్రహానికి రాష్ట్ర మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, రాష్ట్ర బెవరేజెష్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, క్రిషాంక్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ తదితరులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రిషాంక్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న 12 వేల మంది సైన్యంతో గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని పరిపాలించారన్నారు. బహుజనుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు కల్యాణ చక్రవర్తి, చైర్మన్ క్రిష్ణగౌడ్, సంతోష్, రాజు, ఆనంద్, అజయ్, ప్రభుకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రేమ పేరుతో మోసం

**నిందితుడిపై కేసు నమోదు**

అడ్డగుట్ట: ఇన్‌స్టాగామ్‌లో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదైన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌కు చెందిన అభిలాష్ అనే యువకుడు కార్ డ్రైవర్‌గా పని చేసేవాడు. మూడేళ్ల క్రితం అడ్డగుట్టకు చెందిన ఓ యువతితో అతడికి ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. బాధితురాలు పెళ్లి ప్రస్తావన తేవడంతో తప్పించుకు తిరుగుతున్నాడు. తాను మోస పోయినట్లు గుర్తించిన బాధితురాలు శుక్రవారం తుకారాంగేట్ పోలీసులను ఆశ్రయించింది. మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.